క్లుప్తంగా

పార్టీ అధినేతతో వైఎస్సార్‌సీపీ నేత



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చంద్రశేఖర్‌రాజు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కొండురూ వెంకటరత్నంరాజు కుమారుడు కొండురూ చంద్రశేఖర్‌రాజు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్సీ రైతులకు ఎరువుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్ : మండలంలోని పెట్లూరు సమీపంలో ఉన్న నిమ్మ, చీనీ పరిశోధన స్థానంలో శుక్రవారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రాజెక్టులో భాగంగా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ, హైదరాబాద్ డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆర్థిక సహకారంతో నిమ్మ, చీనీ తోటల్లో అంతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కోట: గ్రామదేవత కోటమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు శుక్రవారం శ్రీమహాలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

తల్లంపాడులో వైద్య పరీక్షలు



తల్లంపాడులో కంటి పరీక్షలు

దొరవారిసత్రం: మండలంలోని తల్లంపాడు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం తొగరాముడి పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్ ఆధ్వర్యంలో ఎస్ఎన్‌పీఏ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంతేకాకుండా సూళ్లూరుపేట పట్టణ ప్రాంతంలోని అమెరికాన్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో పలువురికి కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు తిరుపాలయ్య, సూపర్‌వైజర్ జనార్దనయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఏపీఓ చిన్నయ్య

ఓజిలి: పొదుపు మహిళలు శ్రీనిధి రుణాలను తీసుకుని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం పద్మమ్మ పేర్కొన్నారు. మండల స్త్రీనిధి భవనంలో సంఘ బంధం అధ్యక్షులు, వీఓఏలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలు స్త్రీనిధి, బ్యాంకు రుణాలను తీసుకుని వ్యాపారం ద్వారా అభివృద్ధి చెందాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లించి వేరొకరికి అవకాశం కల్పించాలని చెప్పారు. గడ్డి పెంచుకునే సౌలభ్యం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చిన్నయ్య, సంఘబంధం అధ్యక్షులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు 27-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	115
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	232
లేయర్ చికెన్	:	187



విత్తనాలు పొలంలో వేస్తున్న రైతులు(ఫైల్)



ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

అందని విత్తనాలు.. ఆగని రైతులు

- అప్పులు చేసి సాగుకు శ్రీకారం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

చిట్టమూరు: మండలంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి రైతులు పొలం పనులు చేసేందుకు ఉపక్రమించారు. పూర్తిస్థాయిలో వర్షాలు పడకపోయినప్పటికీ రైతులు సాగుపై కోటి ఆశలతో పొలాలు దుక్కి చేయడం, నార్లు పోసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే వరుణదేవుడు కరుణించకపోతాడా అనే కోటి ఆశలతో వరి సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గూడూరు నియోజకవర్గంలో కెల్లా మండలంలో ఎక్కువ శాతం వరి సాగవుతోంది. మండలంలో సుమారు 17 వేల హెక్టార్లలో రైతులు రబీలో వరి సాగు చేస్తారు. మెట్ట ప్రాంత రైతులు పొలాలను దుక్కి చేసి వరి విత్తనాలు పొలాల్లో చల్లుతున్నారు. ప్రస్తుతం నెల్లూరు మసూర, బీపీటీ 5204 (పెద్ద జీలకర్ర) ఆర్ఎన్ఆర్ వంగడాలను వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో కొన్ని గ్రామాల్లో బోరు నీటి వసతి ఉన్నప్పటికీ ఎక్కువ శాతం వర్షాధారంగా చెరువు నీటితోనే వరి పంటలు వేస్తారు. రైతులు మాత్రం వర్షం కురుస్తుందనే నమ్మకంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపట్టారు. అయితే బోరు నీటి వసతి ఉన్న గ్రామాలైన గునపాడు, మెట్టు, ఈశ్వరవాక గునపాటిపాళెం, తిమ్మారెడ్డివాగు, పెళ్లకూరు గ్రామాల్లో రైతులు వరినార్లు పోసేందుకు ఉపక్రమించారు. మెట్ట ప్రాంత గ్రామాలైన చిల్లమూరు, మొలకలపూడి, నార్తువరత్తూరు, కుమ్మరిపాళెం, గొల్లలనట్టు, కోగిలి, అరవపాళెం, దరఖాస్తు, వేముగుంట పాళెం గ్రామాల్లో రైతులు నెల రోజుల క్రితం ఎల్లి పైర్లు వేశారు.



వరి విత్తనాలు పొలంలో చల్లుతున్న రైతు

> **వరి విత్తనాలు అందించలేదు**
> వరి విత్తనాలు కిలోకు రూ.5 మాత్రమే రాయితీ ఇవ్వడంతో వరి విత్తనాలు అందిచడం లేదు. ప్రైవేటు దుకాణాల్లోనూ అదే ధర అమ్ముతుండడంతో రైతులు అక్కడే కొనుగోలు చేస్తున్నారు. గత సంవత్సరం నుంచి విత్తనాలు రైతులకు రాయితీపై ఇవ్వడం లేదు.
> – నిరంజన్ కుమార్, మండల వ్యవసాయాధికారి, చిట్టమూరు

రాయితీపై అందని వరి విత్తనాలు

గత ప్రభుత్వంలో రైతులకు రాయితీపై రైతులకు వరి విత్తనాలు అందజేసేవారు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు రాయితీపై అందే వరి విత్తనాలు తెచ్చుకుని వరి సాగు చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో వరి విత్తనాలు రాయితీపై రైతులకు అందకపోవడంతో అప్పులు చేసి ప్రైవేటు దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి వరి సాగు చేసుకుంటున్నారు. వ్యవసాయానికి పెట్టుబడి సాయం కూడా అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు దుకాణదారులు తమ ఇష్టానుసారంగా వరి విత్తనాల ధరలు రైతులకు విక్రయిస్తున్నారు. విత్తనాలు రైతులు దుకాణదారుల వద్ద అప్పు తీసుకోవడంతో వారు చెప్పిందే ధర. దీంతో చేసిది లేక రైతులు విత్తనాలు కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు.

పచ్చి గడ్డి విత్తనాలు పంపిణీ

చిట్టమూరు: మండల పరిధిలోని పాడి రైతులకు పచ్చి గడ్డి విత్తనాలు రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి సురేంద్ర తెలిపారు. స్థానిక పశు వైద్యశాలలో శుక్రవారం ఆయన మా ట్లాడుతూ మొక్కజొన్న విత్తనం కిలో రూ.68 ఉండగా రాయితీపై రూ.51 అందజేస్తున్నామన్నారు. జొన్న విత్తనం కిలో రూ.92 ఉండగా రాయితీపై రూ.69 అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కావల్సిన పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకువచ్చి పశుగ్రాస విత్తనాలు తీసుకోవాలన్నారు.

క్రిస్ సిటీ పనుల పురోగతిపై పరిశీలన

చిల్లకూరు : తీర ప్రాంతంలోని చిల్లకూరు, కోట, మండలాల మధ్యలో ఏర్పాటు చేస్తున్న క్రిస్ సిటీ పనుల పురోగతిపై గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన పరిశీలించారు. క్రిస్ సిటీకి తొలి విడత భూ సేకరణ పూర్తి చేసిన అనంతరం మౌలిక వసతుల కల్పనకు ఏపీఐఐసీ ముందుకు వచ్చి ఓ ప్రైవేటు సంస్థకు పనులు అప్పగించారు. వారు క్రిస్ సిటీ భూముల్లో రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలతో పాటుగా వివిధ రకాల పనులు చేపడుతున్నారు. వీటిని సబ్ కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతూ వర్షాకాలం పనులు చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని దీనిని దృష్టిలో ఉంచుకుని సకాలంలో అనుకున్న ప్రకారం పనులు పూర్తిచేయాలని సూచించారు. పరిహారం విషయంలో కూడా ఎవైనా అడ్డుకుంలు ఉంటే వాటిని అధిగమించేలా చర్యలు చేపడతామని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చిత్రం.. ఏఎంసీ కార్యాలయం



తడలో ఉన్న సూళ్లూరు పేట ఏఎంసీ కార్యాలయం

తడ: మండలంలోని కొండూరు పంచాయతీ, పులివేంద్ర గ్రామం వద్ద విశాల ప్రాంగణంలో వ్యవసాయ మార్కెటింగ్ కార్యాలయం, గోదాములు ఉన్నాయి. సూళ్లూరుపేట సమితిగా ఉన్న సమయంలో 1976 సెప్టెంబర్ 27న సూళ్లూరుపేట నియోజకవర్గం మొత్తానికి సంబంధించి ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. అనంతరం మండలాలు ఏర్పాటు కావడం, సూళ్లూరుపేట ఏఎంసీకి దూరంగా ఉన్న ఓజిలి, పెళ్లకూరు, నాయుడుపేట మండలాల రైతుల ప్రయోజనార్థం 1993 మే 19న నాయుడుపేట ఏఎంసీని ఏర్పాటు చేశారు. మండలాలు, ఏఎంసీ కార్యాయాల విభజన జరిగినా దొరవారి సత్రం, తడ, సూళ్లూరుపేట మండలాలకు సంబంధించి తడలో ఉన్న సూళ్లూరుపేట ఏఎంసీ కార్యాలయం పేరు మాత్రం అలాగే మిగిలి పోయింది.



సూళ్లూరుపేట అడ్రస్ బోర్డుతో ఉన్న ఏఎంసీ కార్యాలయం

శరన్నవరాత్రి సంరంభం

రాపూరు : పెంచలకోనలో గజలక్ష్మిగా ఆదిలక్ష్మీదేవి



సూళ్లూరుపేట: శ్రీ మహాలక్ష్మిగా చెంగాళమ్మ, చిట్టమూరు: కాత్యాయనీదేవిగా కామాక్షమ్మ







చిల్లకూరు : కాత్యాయినిగా ముత్యాలమ్మ



గూడూరు : అన్నపూర్ణాదేవిగా మహలక్ష్మమ్మ



నాయుడుపేట: మహాలక్ష్మీ దేవిగా దుర్గామల్లేశ్వరి

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవారు వివిధ రకాల అలంకరణల్లో భక్తులను కటాక్షించారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా విశేష అలంకరణల్లో ఉన్న అమ్మవారికి భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. -సాక్షి నెట్‌వర్క్



రాపూరు : పోతుకొండలో అన్నపూర్ణదేవిగా అంకమ్మతల్లి

ఏబీవీపీ నూతన కమిటీ ఎంపిక

నాయుడుపేటటౌన్ : పట్టణ ఏబీవీపీ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తిరుపతి జిల్లా ఏబీవీపీ విభాగ్ సంఘటన కార్యదర్శి సాయి సత్య నారాయణ తెలిపారు. పట్టణంలోని ఓ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఏబీవీపీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఏబీవీపీ నూతన నగర అధ్యక్ష, కార్యదర్శులుగా గోపి, జస్వంత్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

కార్మికులను మోసం చేస్తున్న కూటమి

గూడూరురూరల్ : భవన నిర్మాణ కార్మికులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం బీసీడబ్ల్యూయూ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, ఆయాలు, మున్సిపల్ కార్మికుల సమస్యలపై సమీక్ష చేయకపోవడం దారుణమన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డి.పి. పోలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను, శ్రామికవర్గాన్ని మోసం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను పీపీపీ ద్వారా ప్రైవేటీకరణ చేయడం అంటే వైద్య విద్యను పేదలకు దూరం చేయడమేనన్నారు. బీసీడబ్ల్యూయూ రాష్ట్ర నాయకులు హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసే సర్క్యులర్ 1214ను రద్దు చేసి సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ యూనియన్ రాష్ట్ర నాయకులు షేక్ మీరావలి, పీఓడబ్ల్యూ నాయకులు ఆసియా, మమత, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, చెంగల్‌రావు, బీసీడబ్ల్యూయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవకోటి, అరుణోదయ శ్రీను, అనీల్, నాయకులు రత్నం, ఐఎఫ్‌టీయు మండల నాయకులు పాల్గొన్నారు.



జిల్లా సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

మధ్యాహ్నమైనా తెరుచుకోని సచివాలయం

నాయుడుపేటటౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద ఉన్న బీఎంఆర్ నగర్ వార్డు సచివాలయం శుక్రవారం 12 గంటలకు దాటిన తెరకవపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి సచివాలయం పరిధిలోని అనేక మంది సర్టిఫికెట్ల కోసం కార్యాలయం వద్దకు రాగా కార్యాలయం మూసి ఉండడంతో నానా ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఇక్కడి సచివాలయంలో పనిచేసే వీఆర్‌ఓ అందుబాటులో లేకపోవడం, కనీసం ఫోన్ చేసినా స్పందించలేదు. ఈ విషయమై బాధితులు తహసీల్దార్ రాజేంద్రకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌ఐ కూడా వీఆర్‌ఓకు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో విసిగిపోయిన తహసీల్దార్ మరో సచివాలయ వీఆర్‌ఓకు సర్టిఫికెట్లను లాగిన్ చేయించి సర్టిఫికెట్లు మంజూరు చేయించారు. బీఆర్‌ఆర్ నగర్ సచివాలయం 12 గంటలకు వరకు తెరచుకోక పోవడంపై మున్సిపల్ మేనేజర్ ఊరుకుందమ్మకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి సచివాలయ అడ్మిన్ భాను ప్రసాద్ వివరణ ఇస్తు అడ్మిన్‌తోపాటు మహిళ పోలీస్, మరో కార్యదర్శి ఎన్నికల జాబితాలపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్నారని చెప్పారు. వీఆర్వోతోపాటు మరో ముగ్గురు కార్యదర్శులు సచివాలయానికి రాకపోవడంతో వారికి మున్సిపల్ కమిషనర్ అదేశాల మేరకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లు అడ్మిన్ తెలిపారు. సచివాలయం మూత వేయకుండా ఎవరైనా విధుల్లో ఉండేలా చర్యలు చేపడతామన్నారు.



తెరుచుకోని బీఎంఆర్ నగర్ సచివాలయం

కండలేరులో 55.220 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 55.220 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరుకాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సప్లయ్ లేని కాలువలు

తెలుగు గంగ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి పొదలు







జీలపాటూరు, పాలచ్చూరు, కలవకూరు పంట కాలువల్లో ఏపుగా పెరిగిన గడ్డి



పంట కాలువలను పిచ్చిమొక్కలు కమ్మేయడంతో పొలాలకు నీరు అందక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో తెలుగు గంగ 7వ బ్రాంచ్ కాలువ, స్వర్ణముఖి సిస్టమ్ కింద కలవకూరు సప్లయ్ కాలువలు ఉన్నాయి. సుమారు 32 కిలోమీటర్లు పొడవున్న వ్యవసాయ కాలువలతో పాటు తక్కిన పంట కాలువల్లో కూడా 80శాతానికి పైగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న తేలికపాటి వర్షాల వలన వ్యవసాయ కాలువలు సక్రమంగా లేకపోవడంతో చెరువుల్లోకి సాగునీరు చేరడం కష్టతరమైంది. దాంతో రబీ సీజన్‌కు దుక్కి దున్నడం, వరినారు మడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలుగు గంగ కాలువకు గతంలో రూ1.2 కోట్ల వ్యయంతో చేపట్టిన బెడ్ కాంక్రీట్ పనులు ఆగిపోవడంతో మిగిలిన కాలువలో దర్భ, గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. 7వ బ్రాంచ్ కాలువతో పాటు కలవకూరు సప్‌లై చానల్ కాలువల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో సాగునీరు చెరువులకు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – పెళ్లకూరు